పల్లె పోరు రసవత్తరంగా సాగుతోంది. నిన్న, మొన్నటి వరకు అభ్యర్థుల ఎంపిక, నామినేషన్ల దాఖలులో తలమునకలైన రాజకీయ పార్టీల నేతలు.. నామినేషన్లు వేసిన రెబల్ అభ్యర్థులను బుజ్జగిస్తున్నారు. మొదటి విడత నామినేషన్లు ముగియడంతో ప్రధాన రాజకీయ పార్టీల నేతలంతా నామినేషన్లు దాఖలు చేసినవారిలో గెలుపు గుర్రాలు ఎవరనే విశ్లేషణ చేస్తున్నారు. మరోవైపు రెండవ విడతలో నామినేషన్ల ప్రక్రియ మొదలు కావడంతో జిల్లావ్యాప్తంగా పార్టీ నేతలు గ్రామాల్లో అభ్యర్థుల ఎంపికలో తలమునకలవుతున్నారు.

బుజ్జగింపుల పర్వం

- గ్రామాల్లో ప్రధాన పార్టీల్లో అభ్యర్థుల మధ్య కుదరని ఏకాభిప్రాయం
- గ్రూపులుగా విడిపోతున్న నాయకులు
- నామినేషన్ల ఉపసంహరణ కోసం నేతల మంతనాలు
- పార్టీ బలపర్చకపోతే ప్రత్యామ్నాయం చూసుకుంటున్న ఆశావహులు
- సమన్వయ కమిటీల ముమ్మర చర్చలు
- ఆరు మండలాలలో సర్పంచ్‌కు 798, వార్డు మెంబర్లకు 2080 నామినేషన్లు
- ఈనెల 3న ఉపసంహరణ
- ఒకే నామినేషన్ దాఖలుతో పలుచోట్ల ఏకగ్రీవం


బీఆర్‌ఎస్‌లో చేరిన సర్పంచ్ అభ్యర్థి (ఫైల్)


ఏకాభిప్రాయం కోసం చర్చలు జరుపుతున్న కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ (ఫైల్)

ఖానాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌లు క్షేత్రస్థాయిలో తాము బరిలోకి దింపే అభ్యర్థులకు పార్టీ క్యాడర్‌ను అండగా ఉంచేలా ఆది నుంచి ఎత్తుగడలు వేస్తూ వస్తున్నాయి. అయినా మొదటి విడత నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగిసేలోపు పలుచోట్ల నేతలు ఎత్తుగడలు సాగలేదు. క్షేత్రస్థాయిలో సర్పంచ్, ఉపసర్పంచ్ పదవులను దక్కించుకునేందుకు ప్రధాన పార్టీల నాయకులంతా పలుచోట్ల పోటాపోటీగా దాఖలు చేశారు. ఒక్కో గ్రామంలో ఒక్కో పార్టీ నుంచి ఇద్దరు కంటే ఎక్కువ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో సమన్వయ కమిటీలను ఏర్పాటుచేసి చర్చలు జరిపినా నామినేషన్లు ముగిసే వరకు ఆ చర్చలు కొలిక్కి రాలేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల సర్పంచ్ పదవికి రాజీ పడినా.. ఉప సర్పంచ్ పదవికి నాయకులు రాజీపడకుండా ఒకే పార్టీ నుంచి వార్డుసభ్యులుగా ఇద్దరిద్దరు అభ్యర్థులను బరిలో నిలిపినట్లు చెబుతున్నారు. దీంతో వచ్చే సర్పంచ్ పదవి సైతం చేజారి పోతుందేమోనని నాయకులు మథనపడుతున్నారు. ఇదివరకు గత ప్రభుత్వ హయాంలో సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు జాయింట్ చెక్‌పవర్ ఉండడంతో గ్రామాల్లో సర్పంచ్ పదవి కంటే ఉపసర్పంచ్ పదవిపై నాయకులు పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఒలోనే పలు పార్టీల అభ్యర్థులను ఇంకా ఏకాభిప్రాయాలు రాలేదని చెబుతున్నారు.

నామినేషన్ల ఉపసంహరణకు చర్చలు

మొదటి విడతలో ఎన్నికలు జరుగనున్న దస్తురాబాద్, కడెం, పెంబి, ఖానాపూర్, మామడ, లక్ష్మణచాంద మండలాలలో 136 గ్రామ పంచాయతీలు ఉండగా, 1072 వార్డులున్నాయి. ఇందులో సర్పంచ్ పదవి కోసం 798 నామినేషన్లు రాగా, వార్డు సభ్యుల పదవి కోసం 2,080 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులకు ఈనెల 3న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇవ్వడంతో రెబల్‌గా బరిలోకి దిగిన అభ్యర్థులను బుజ్జగించి వారి నామినేషన్లను ఉపసంహరింపజేసేందుకు ప్రధానపార్టీలలో సమన్వయ కమిటీలు తెర వెనుక మంత్రాంగం నడుపుతున్నాయి. పార్టీల జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేల సహకారంతో గెలుపు గుర్రాలకే అవకాశం కల్పించి మిగతా వారిని పోటీ నుంచి తప్పించేందుకు చర్చలు జరుపుతున్నారు.

పార్టీలు మారుతున్న నాయకులు

సర్పంచ్ పోటీకి పార్టీ నుంచి తమకు మద్దతు లభిస్తుందో లేదోననే అయోమయం నెలకొన్న నాయకులు కొందరు పార్టీలు మారేందుకు సైతం వెనుకాడడం లేదు. ఇటీవల ఖానాపూర్ మండలంలోని ఎర్వచింతల్‌లో సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు అధికార పార్టీ నుంచి పోటీ ఎక్కువగా ఉండటంతో ఓ అభ్యర్థి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆ పార్టీ క్యాడర్ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచారు.

పలుచోట్ల ఒకటే నామినేషన్ దాఖలు

మొదటి విడతలో పలుచోట్ల సర్పంచ్ పోటీకి ఒకే నామినేషన్ రావడంతో ఆ గ్రామ పంచాయతీలో ఏకగ్రీవం లాంఛనంగా మారింది. మామడ మండలంలోని వాస్తాపూర్, ఆరేపల్లి, పెంబి మండలంలోని కోసగుట్ట, జంగుగూడ, రాంనగర్, ఖానాపూర్ మండలంలోని కొలంగూడ, బావాపూర్ తండా, అడవి సారంగాపూర్ గ్రామ పంచాయతీలకు సర్పంచ్ పదవి కోసం ఒక్కో నామినేషన్ దాఖలు అయినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. మరికొన్నిచోట్ల రెండు, రెండు నామినేషన్లు దాఖలైన గ్రామ పంచాయతీలో ఏకగ్రీవం కోసం ముమ్మరంగా చర్చలు సాగుతున్నట్లు తెలుస్తోంది. 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ముగిస్తే మరిన్ని గ్రామ పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశముంది.

రెండో విడత నామినేషన్ల స్వీకరణ

జిల్లాలో రెండో విడతలో ఏడు మండలాలలో పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి. నిర్మల్ రూరల్, సోన్, సారంగాపూర్, దిలావర్‌పూర్, నర్సాపూర్(జి), లోకేశ్వరం, కుంటాల ఏడు మండలాలలో 131 గ్రామ పంచాయతీలలో 131 సర్పంచ్, 1,170 వార్డుసభ్యుల ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. మొదటిరోజు సర్పంచ్ పదవి కోసం 119 నామినేషన్లు రాగా, వార్డుసభ్యుల కోసం 122 నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈనెల 2న వరకు కొనసాగనుంది. మొదటి రోజు ఆదివారం కావడంతో నామినేషన్లు తక్కువగా వచ్చినట్లు రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. సోమవారం నామినేషన్ల దాఖలు ప్రక్రియ జోరందుకోనుందని భావిస్తున్నారు.


నామినేషన్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లు, బందోబస్తు పరిశీలిస్తున్న ఎస్పీ

పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు

- ఎస్పీ జానకీ షర్మిల
- చిట్యాల, వెంగ్వాపేట్ నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

నిర్మల్‌కైన్‌గేట్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పకడ్బందీగా భద్రత చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. ఆదివారం నిర్మల్‌రూరల్ ప్రాంతాల్లోని చిట్యాల, వెంగ్వాపేట్ గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లు, బందోబస్తు పరిస్థితులను ఎస్పీ పరిశీలించారు. నామినేషన్ వేసేటప్పుడు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా, శాంతియుతమైన వాతావరణంలో నామినేషన్ ప్రక్రియ పూర్తయ్యే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. ఆమెవెంట నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్, రూరల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ సమ్మయ్య, ఎస్సై లింబాద్రి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భద్రత ఏర్పాట్లపై ఎస్పీ సమావేశం

నిర్మల్ టౌన్: జిల్లా పోలీస్ క్యాంపు కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలకు భద్రత ఏర్పాట్లపై ఎస్పీ జానకీ షర్మిల జిల్లా పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఎస్పీ దిశానిర్దేశం చేశారు. పోలింగ్ స్టేషన్ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు, చెక్‌పోస్టుల కార్యకలాపాల పర్యవేక్షణ, సున్నితమైన ప్రాంతాల గుర్తింపు, రూట్ మొబైల్ వాహనాల మానిటరింగ్ వంటి అంశాలపై వివరంగా చర్చించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. అనుమానాస్పద కదలికలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలు గమనించిన వెంటనే ప్రజలు పోలీసులకు తెలియజేయాలని తెలియజేశారు. సమావేశంలో ఎస్పీ జానకీ షర్మిల ఐపీఎస్‌తో పాటు నిర్మల్ ఏఎస్పీ రాజేష్‌మీనా ఐపీఎస్, జిల్లాలో ఉన్న అందరూ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

తానూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం తానూర్‌లో నారికేళ పుండ్లిక్ గురుస్వామి, తాడేవార్ గోవింద్ కన్నెస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడిపూజను ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి సన్నిధానం, 18మెట్ల దివ్యపదునెట్టాంబడి చేసి గణపతి స్వామి, సుబ్రమహణ్యస్వామి, అయ్యప్ప స్వామి వారి విగ్రహాలను ప్రతిష్ఠించి పంచామృత అభిషేకం నిర్వహించారు. గురుస్వాములు కృష్ణచారి, గణేష్, సంతోష్‌చారి, కొండల్‌వాడి శంకర్ మహారాజ్, భజనబృందం, అయ్యప్పస్వామి పాటలతో అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. కర్పూరంతో దివ్యపదునెట్టాంబడి వెలిగించి మహాహారతి నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వామి భక్తులకు ఆయాగ్రామాల ప్రజలకు మహాఅన్నదాన ప్రసాదం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో నారికేళ సిద్ధూ గురుస్వామి, పెద్దకాపు గజ్జారాం గురుస్వామి, బెంబర సంతోష్‌గురుస్వామి, లక్ష్మణ్‌గురుస్వామి, అయ్యప్ప స్వాములు భక్తులు తదితరులున్నారు.


దివ్యపదునెట్టాంబడి వెలిగిస్తున్న కన్నెస్వాములు

టెట్‌పై ఆందోళన అవసరం లేదు

- ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్

బాసర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): టెట్‌పై ఉపాధ్యాయులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎస్టీయూ టీయెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ అన్నారు. ఆదివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నూతనంగా ఎన్నికైన సందర్భంగా ఆయన బాసర అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆయనను మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి వినహాయింపు ఇచ్చేలా కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని అన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ప్రభుత్వంతో చర్చించి పరిష్కారం కోసం సంఘం కృషి చేస్తుందని అన్నారు. ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీసురూల్స్ సాధించి పదోన్నతులు కల్పిస్తామన్నారు. సీపీఎస్ రద్దు కసం ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమన్నయాదవ్, రాష్ట్ర బాధ్యులు ఏ.బాజారెడ్డి, పల్సీకర్ శ్రీనివాస్ జిల్లా పూర్వ అధ్యక్షుడు డి.రామారావు, జిల్లా ఆర్థిక కార్యదర్శి బి.వెంకటేశ్వర్‌రావు, బాసర మండలఅధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరేందర్‌రావు, రవీందర్, జిల్లా నాయకులు గణపతి, పోలీసకర్ గంగాధర్, పిప్పర్ శ్రీనివాస్,లక్ష్మీపతి, గంగాధర్ భోస్లే నారాయణ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి గజేందర్


నామినేషన్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆయేషా మస్రత్ ఖానమ్

ఎన్నికల నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు

పెంబి, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన పెంబి, మందపల్లి నామినేషన్ల కేంద్రాన్ని జిల్లా పరిశీలకులు ఆయేషామస్రత్ ఖానమ్ పరిశీలించారు. మండల కేంద్రంలోని పెంబి, మందపల్లి క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా పరిశీలకులు మాట్లాడుతూ హెల్ప్‌డెస్క్‌లో సిబ్బంది అందుబాటులో ఉంటూ అభ్యర్థులకు సమాచారం ఇవ్వడంలో సహాయ పడాలన్నారు. అధికారులు సమయపాలన పాటించాలన్నారు. రిజిస్టర్లలో పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్, రమేష్ రావు, ఎంపీవో అనిల్ ఉన్నారు.

సోన్: మండలంలోని కడ్తాల్ నామినేషన్ క్లస్టర్ సెంటర్‌ను ఆదివారం ఎన్నికల పర్యవేక్షకురాలు ఆయేషా మస్రత్ ఖానమ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నామినేషన్ పత్రాలను పూర్తిగా పరిశీలించి, స్వీకరించాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా పత్రాలు ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్, నిర్మల్ ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్


నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

కుంటాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్ సూచించారు. కుంటాల మండల కేంద్రంలోని ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. నామినేషన్ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడి వారు విధులు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. నామినేషన్ కేంద్రం బయట సిబ్బంది తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ కమల్‌సింగ్, ఎంపీడీవో వనజ, ఎంపీవోరహీం, సిబ్బంది ఉన్నారు.

వంజరి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ఖానాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తిమ్మాపూర్ వంజరి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాడిగే రమణరాజ్, ప్రధానకార్యదర్శిగా ధాత్రిక రాము, కోశాధికారిగా కాలేరి నాగభూషణం, ఉపాధ్యక్షుడిగా ఆమందరాజు, కరిపే రాజారాం, సాడిగే ప్రసాద్, నవాత్ వేణుగోపాల్, గౌరవ అధ్యక్షుడిగా మట్టేరి గంగాధర్, ధాత్రిక లక్ష్మణ్, సహాయ కార్యదర్శులుగా కరిపే రాజేందర్, నరసింహారాజ్, రాజ్ కమల్, రాజేశ్వర్, ముఖ్య సలహాదారులుగా బుచ్చన్న, రాకేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సంఘ అభివృద్ధి కోసం కృషిచేస్తామని పేర్కొన్నారు. తమపై నమ్మకం ఉంచిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సంఘ సభ్యులు నూతనకార్యవర్గాన్ని సన్మానించారు.


నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న వంజరి సంఘం సభ్యులు

అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

- బీఆర్‌ఎస్ ముథోల్ సమన్వయ కమిటీ ప్రతినిధి డా.కిరణ్ కోమ్రేవార్

భైంసా, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆ పార్టీ ముథోల్ సమన్వయ కమిటీ ప్రతినిధి డా. కిరణ్ కోమ్రేవార్ పిలుపునిచ్చారు. ఆదివారం భైంసాలో నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల పార్టీ శ్రేణులు, ప్రతినిధులతో జరిపిన భేటిలో మాట్లాడారు. గులాబీ శ్రేణులన్నీ ఏకతాటిపై సమన్వయంతో వ్యవహరించుకుంటూ సమిష్టిగా కృషిచేస్తూ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. వార్డుసభ్యుల నుంచి సర్పంచుల వరకు పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పాటుపడాలన్నారు. ఎన్నికల ప్రచార పర్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో జరిగిన అభివృద్ధి, సాధించిన విజయాలు, చేపట్టిన సంస్కరణలు, ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ పార్టీ అభ్యర్థుల గెలుపుకు మార్గం సుగమం చేయాలని అన్నారు. ఇందులో మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ గంగాచరణ్, మాజీ ఎంపీటీసీ దేవిదాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సమన్వయ కమిటీ ప్రతినిధి డా. కిరణ్ కోమ్రేవార్

ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవం


ఆలయంలోని వినాయకుడు

లక్ష్మణచాంద, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిపెల్లిలో గల వినాయక ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గల వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవానికి హాజరైన భక్తులకు స్త్రీ వైద్య నిపుణురాలు అయిండ్ల స్వర్ణారెడ్డి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర కొనసాగింది. స్థానిక వీడీసీ సభ్యులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పూజారి బండపాటి రమేష్ చారి, గ్రామస్థులు, సమీప గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభలను విజయవంతం చేయాలి


ఆహ్వాన పత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ముథోల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మూడో తెలుగు మహాసభలను విజయవంతం చేయాలని ఏడు పాయల సంస్థాన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ప్రముఖ పద్యకవి బి.వెంకట్ కోరారు. నిర్మల్‌లో తెలంగాణ ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రాంగణంలో ఆదివారం సంబంధిత 3వ ప్రపంచ తెలుగు మహాసభల ఆత్మీయ ఆహ్వానపత్రాలు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 3, 4, 5 తేదీల్లో 3వ ప్రపంచ తెలుగు మహాసభలు ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఆంధ్రసారస్వత పరిషత్ అధ్యక్షుడు డా.గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారని తెలిపారు. తెలుగుసాహిత్య సభలు, తెలుగుకవి సమ్మేళనాలు, అష్టావధానాలు, శతావధానాలు, తెలుగుకవి సమ్మేళనాలు, తెలుగు సాహిత్య సమీక్షలు, హరికథలు, బుర్రకథలు, పద్య, సాంఘిక నాటకాలు, జానపద, శాస్త్రీయ నృత్యాలు, హాస్యవల్లరి, హాస్యకదంబం, గ్రంథావిష్కరణలు, సాహితీ సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు, తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే అనేకమైన సేవాకార్యక్రమాలు జరుగనున్నాయన్నారు. ప్రపంచస్థాయిలో మహా సాహితీ మేధావులు, ప్రముఖులు పాల్గొననున్నారన్నారు. కార్యక్రమంలో కవులు నేరెళ్ల హనుమంతు, పత్తి శివప్రసాద్, అంబటి నారాయణ, పోలీస్ భీమేష్, పోతన్న, కడారి దశరథ్, శశికుమార్, గంగన్న, బసవరాజు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలపై అవగాహన



భీంపూర్ కస్తూర్బా విద్యాలయంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీంపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం భీంపూర్ మండల కేంద్రం కస్తూర్బా విద్యాలయంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నుటుల రవీందర్, మాట్లాడుతూ మూఢ నమ్మకలు మన అభివృద్ధికి ఆటంకంగా మారాయన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఉమాకాంత్, ప్రధాన కార్యదర్శి పెంట పర్తి ఉశన్న, జిల్లా నాయకులు గంగన్న, అమిత్ నాయక్, కస్తూర్బా టీచర్లు జ్యోతి, లత తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

ముథోల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన ఏర్పాట్లు అన్ని పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణను ఈ నెల 3వ తేదీ మంగళవారం నుంచి స్వీకరించనున్నట్లు ఎంపీడీవో లవకుమార్ వెల్లడించారు. నామినేషన్ల స్వీకరణ కోసం 19 గ్రామ పంచాయతీలకు గాను ఐదు క్లస్టర్ల ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల పరిధి లోని తరోడా క్లస్టర్‌లో తరోడా, ముద్గల్, మచ్కల్, రాంటెక్ గ్రామ పంచాయతీలు, ఎడ్ బిడ్ క్లస్టర్‌లో ఎడ్‌బిడ్, ఎడ్‌బిడ్ తండా, చించాల, వెంకటాపూర్, బోరిగాం క్లస్టర్‌లో బోరిగాం, కారేగాం, చింతకుంట, వడ్తాల్, బ్రహ్మన్‌గాం క్లస్టర్‌లో బ్రహ్మన్‌గాం, ఆష్టా, రువ్వి, గన్నోర, విట్టోలి తండా, ముథోల్ క్లస్టర్‌లో ముథోల్, విట్టోలి గ్రామాల సర్పంచ్‌లు, వార్డు స్థానాలకు నామినేషన్లు స్వీకరించామన్నారు.

సర్పంచ్ పదవికి ఎనిమిది నామినేషన్‌లు

భీంపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం సర్పంచ్ పదవులకు గాను ఎనిమిది, వార్డు సభ్యుల 21 నామినేషన్లు దాఖలు అయ్యాయని ఎంపీడీవో గోపాల కృష్ణారెడ్డి తెలియజేశారు. పిప్పల్కోటి పంచాయతీ క్లస్టర్ నుంచి సర్పంచ్ మూడు, వార్డులకు 3, అందర్ బంద్ పంచాయతీ క్లాస్టర్ నుంచి సర్పంచ్ ఒకటి, వార్డు తొమ్మిది, ధన్నోర పంచాయతీ కాస్టర్ నుంచి సర్పంచ్ 2, వార్డుకు ఎనిమిది, కరంజీ పంచాయతీ క్లస్టర్ నుంచి సర్పంచ్ ఒకటి వచ్చినట్లు ఆయన వివరించారు.

పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి

» డీసీసీ అధ్యక్షుడు డా.నరేష్‌జాదవ్



అభివాదం చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నరేష్‌జాదవ్, నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విభేదాలు లేకుండా అందరినీ కలుపుకుంటూ పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేలా ముందుకు సాగుతామని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్‌జాదవ్ అన్నారు. ఆదివారం టీఎన్జీవోస్ భవనంలో పార్టీ జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. నూతనంగా డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన నరేష్‌జాదవ్‌ను పార్టీ నాయకులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఎన్నికల్లో ఏ విధంగా వ్యవహరించాలి, అభ్యర్థుల గెలుపు కోసం ఎలా ముందుకు సాగాలో దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు నరేష్‌జాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధిష్ఠానం అధ్యక్ష పదవి ఇచ్చిందన్నారు. పార్టీలో విభేదాలు లేకుండా అందరిని కలుపుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేలా దిశగా కృషి చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త, నాయకులు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయంబాపురావ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్‌బాపురావ్, డీసీసీబీ, గ్రంథాలయ సంస్థల చైర్మన్లు అడ్డిభోజారెడ్డి, మల్లెపూలనర్సయ్య, బోథ్ నియోజక వర్గ ఇన్‌చార్జీ ఆడేగజేందర్, ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, పార్టీ నాయకులు గంద్రత్ సుజాత, సంజీవ్‌రెడ్డి, శాంతన్‌రావు, వసీం, ఫైజుల్లా, ఆశమమ, గోకగణేష్‌రెడ్డి, బాలూరి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మావల గ్రామ పంచాయతీ పరిధిలో ఫ్లాగ్ మార్చ్

» ప్రజలలో పోలీసు పట్ల విశ్వాసం, నమ్మకం పెంచడానికి ఫ్లాగ్ మార్చ్‌ల నిర్వహణ
» పాల్గొన్న 60 మంది పోలీసు అధికారులు, సిబ్బంది.
» ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మావల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండవ విడతలో భాగంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్న సందర్భంలో ఆదివారం ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ మావల మండల కేంద్రం లోని పురవీధుల గుండా కొనసాగింది. ప్రజలలో పోలీసుల పట్ల విశ్వాసం నమ్మకం పెంచేలా ఉండడానికి ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఫ్లాగ్ మర్చి నందు మావల పోలీస్ స్టేషన్ సిబ్బంది, 20 మంది స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయడం జరుగుతుంది తెలిపారు. ఈ కార్యక్రమంలో మావల సీఐ కర్ర స్వామి, టూ టౌన్ సీఐ కె నాగరాజు, ఎస్సైలు రాజశేఖర్ రెడ్డి, మనోహర్, యూనిస్ ఖాన్ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కవి వెంకట్‌కు రాష్ట్రస్థాయి ఆత్మీయ సమ్మేళన సన్మానం



వెంకట్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ముథోల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌కు చెందిన కవి యాత్ర జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రచయితల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రముఖ పద్య కవి, వ్యాఖ్యాత డా. బి. వెంకట్‌కు కలం స్నేహం రాష్ట్ర స్థాయి ఆత్మీయ సమ్మేళన సన్మానాన్ని కలం స్నేహం వ్యవస్థాపకులు ఆచార్య గోపాల్ చేతుల మీదుగా అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో జరిగిన ఈ సభలో ప్రముఖ కవులు, కళాకారులు తదితరులున్నారు. డా. బి.వెంకట్ కవి మాట్లాడుతూ... సంగీ తాది లలిత కళలకు విద్యనే మూలమని అన్నారు. సరస్వతీ అమ్మవారి అనుగ్రహముతో అన్ని రంగా ల్లో రాణించాలన్నారు. తర్వాత సంస్కృత సుభాషితాలను, శ్లోకాలను, తెలుగు పద్యాలను గానం చేశా రు. తాను సమాజానికి అందించిన సాహితీ సేవలకు గుర్తుగా విశిష్ట అతిథిగా ఈ సన్మానమును పొందినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రముఖ కవులు డా. కావేరి ఫౌండేషన్ చైర్మన్ డా. అప్పాల చక్రధారి, జాతీయ కన్వీనర్ గీతశ్రీ స్వర్గం, జిల్లా అధ్యక్షుడు దేవిప్రియ, సమన్వయ కార్యదర్శులు కడారి దశరథ్, కొండూరి పోతన్న, తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షులు నేరెళ్ల హన్మంత, బొందిడి పురుషోత్తమరావు, అంబటి నారాయణ, పత్తి శివ ప్రసాద్, పోలీస్ భీమేష్‌లు వెంకట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

అంకిత భావంతో పనిచేసినప్పుడే సమాజంలో గుర్తింపు : ఎంపీడీవో శంకర్



ఎంపీవో వినోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో

తలమడుగు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీడీవో శంకర్ అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఎంపీఈవోగా గత కొన్ని సంవత్సరాలు విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన ఎంపీ వినోద్ కుమార్ దంపతులను మండల పరిషత్ సిబ్బంది పంచాయతీ సెక్రెటరీలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు పదోన్నతులు పదవి విరమణ సహజమైనప్పటికీ విధి నిర్వహణలో చేసిన పనితనంతోనే గుర్తింపు లభిస్తుందన్నారు. వినోద్ కుమార్ తన ఉద్యోగరీత్యలో ఎలాంటి మచ్చ లేకుండా మంచి ఉద్యోగ విరమణ పొందడం ఎంతో అభినందనీయం అన్నారు. ఇందులో పిఆర్‌ఏ ఈ. నారాయణ, పంచాయతీ సెక్రటరీలు, ఎంపీడీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలం

కుంటాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కుంటాల మండలంలోని సూర్యాపూర్ గ్రామంలో శనివారం రాత్రి బ్రహ్మకమలం వికసించింది. అర్ధరాత్రి వేళ గ్రామానికి చెందిన కదం రాజేశ్వర్ పటేల్ ఇంటి ముందర ఈ కమలం వికసించడంతో ఆయన కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు.



సూర్యాపూర్ గ్రామంలో బ్రహ్మ కమలానికి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

రవి హైస్కూల్‌లో సైబర్ క్రైమ్‌పై అవగాహన



సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ లక్కంపల్లి వెంకట రమణ

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని రవి ఉన్నత పాఠశాలలో నేషనల్ సైబర్ డే పై అవగాహన కల్పించారు. డిజిటల్ యుగంలో సైబర్ భద్రత ప్రాధాన్యాన్ని విద్యార్థులకు చేరవేయడం లక్ష్యంగా పాఠశాల ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక పోలీసు శాఖ సైబర్ క్రైమ్ ఇన్స్‌పెక్టర్ లక్కంపల్లి వెంకటరమణ హాజరయ్యారు. ఇంటర్నెట్ వినియోగం విస్తరిస్తున్న తరుణంలో సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయని, ప్రతీ విద్యార్థి - తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫేక్ కాల్స్, బ్యాంక్ ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా అకౌంట్ హ్యాకింగ్, గేమింగ్ వ్యస నం, వ్యక్తిగత వివరాల దుర్వినియోగం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ఓటీపీ, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోకూడదన్నారు. అనుమానాస్పద లింకులు క్లిక్ చేయవద్దని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాణి, కరస్పాండెంట్ వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. చిన్న వయస్సులోనే సైబర్ భద్రతపై అవగాహన కలిగితే పిల్లల భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు.

చాంద(టీ) గ్రామ పంచాయతీని పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్



ఎన్నికల అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర జనరల్ ఎలక్షన్ అబ్జర్వర్ టి.వెంకన్న

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాంద(టీ) గ్రామ పంచాయతీని రాష్ట్ర జనరల్ ఎలక్షన్ అబ్జర్వర్ టి.వెంకన్న పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్షన్‌లు ఎలాంటి సమస్యలు లేకుండా శాంతివతంగా నిర్వహించేటట్టు చూడాలని అలాగే ఒక హెల్ప్ లైన్ సెంబర్‌ను ఏర్పాటు చేసి నామినేషన్ వేసి అభ్యర్థులకు ఉన్న అనుమానాలను తీర్చాలన్నారు. చదువులేని అభ్యర్థులకు నామినేషన్ ఫామ్ నింపడంలో సహాయం చేయాలన్నారు. ఎక్కువ మొ త్తంలో నామినేషన్‌లు వచ్చేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీఓ వంశీ, చాందా(టీ) పంచాయతీ సెక్రెటరీ నసీమా పాల్గొన్నారు.

38 జీపీలకు 185 సర్పంచ్ అభ్యర్థులు

ఉట్నూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 38 గ్రామ పంచాయతీలకు 185 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. శనివారం రాత్రి పదిన్నర గంటల వరకు ఆయా రిటర్నింగ్ అధికారులు ఐదు గంటల లోపు నామినేష్ కేంద్రానికి వచ్చిన వారికి టోకెన్లు అందించి రాత్రి 10.30 వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. మండలలో ఉన్న 336 వార్డులకు 556 మంది అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. ఉట్నూర్ గ్రామ పంచాయతీకి 16 మంది మహిళ సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు స మర్పించారు. దంతనపల్లి క్లస్టర్లో చెరువుగూడెం పంచాయతీకి ముగ్గురు, దంతనపల్లికి నలుగురు, హీరాపూర్ జెకు నలుగురు, టీర్సాయిపేట పంచాయతీకి నలుగురు, గోండుగూడ పంచాయతీకి నలుగురు, నర్సాపూర్ జె పంచాయతీకి ఒకరు నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవం అయ్యే అవకాశాలు ఏర్పడ్డాయి. హస్నాపూర్ క్లస్టర్‌లో హస్నాపూర్ పంచాయతీకి ఐదుగురు, చాందూరికి ముగ్గురు, శ్యాంనాయక్ తండాకు ఏడుగురు సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు వేయగా మారుగూడ పంచాయతీకి ఒకే ఒకరు నామినేషన్ వేయడంతో ఏకగ్రీ వం కానుంది. తాండ్ర క్లస్టర్లో సాలెవాడ(బి) పంచాయతీకి ఆరుగురు నామినేషన్లు వేయగా తాండ్ర పంచాయతీకి, బాబాపూర్ పంచాయతీకి ఒక్కరు చొప్పున నామినేషన్లు వేయడంతో రెండు పంచాయతీలు కూడా ఏకగ్రీవం అయ్యే అవకాశాలు ఉన్నాయి. షాంపూర్ క్లస్టర్‌లో నాగాపూర్‌కు ఇద్దరు, షాంపూర్‌కు ఐదుగురు, లింగోజి తండాకు నలుగురు, లక్కేటిపేటకు ఇద్దరు సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. కామయిపేట, టక్కుగూడ పంచాయతీలకు ఒక్కొక్క నామినేషన్‌లు రావడంతో అక్కడ ఏకగ్రీవం అయ్యే అవకాశాలున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

» లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు
» మృతుల్లో నాలుగేళ్ల బాలుడు నిసాద్, బస్సుక్లీనర్



లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

నేరడిగొండ, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి): ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం బోథ్ ఎక్స్ రోడ్డు వద్ద ఆదివారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి ఉత్తరప్రదేశ్ లోని గోరఖ్‌పూర్ వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. పోలీసుల కథనం మేరకు.. ఆదివారం ఉదయం అతి వేగంతో వచ్చిన ప్రైవేట్ బస్సు, బోథ్ క్రాస్ రోడ్డు వద్ద అదుపుతప్పి లారీని వెనుక భాగంలో ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న నాలుగేళ్ల బాలుడు నిసాద్, బస్సు క్లీనర్ రవిసింగ్ (50) అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన బాలుడి తల్లిదండ్రులు కరిష్మా, సోనులకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ప్రయాణికుడికి కూడా గాయాలైనట్లు సమాచారం. సమాచారం అందుకున్న వెంటనే ఎస్సై ఇమ్రాన్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై కేసునమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అతి వేగమే ప్రమాదానికి కారణమని ఎస్సైఇమ్రాన్ అన్నారు.

అతివేగం.. ఇద్దరి ప్రాణం తీసింది!

» ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ అఖిల్ మహాజన్



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

నేరడిగొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలిగొన్నాయి. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ చిన్నారి సహా బస్సు కండక్టర్ మృతి చెందారు. హైదరాబాద్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు వెళ్తున్న సింగ్ ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సు, నేరడిగొండ మండలం బోథ్ ఎక్స్‌రోడ్డు వద్ద అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ప్రమాద వివరాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం తెల్లవారు జామున సుమారు 4.30 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బస్సు డ్రైవర్ గోవింద్ ప్రసాద్ జైస్వాల్ అతివేగంగా, అజాగ్రత్తగా వాహనాన్ని నడపడమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ప్రయాణికులు హెచ్చరించినప్పటికీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించి, రోడ్డుపై వెళ్తున్న మరో వాహనాన్ని తప్పించబోయి లారీని ఢీ కొట్టగా ఈ ఘటనలో గోరఖ్‌పూర్‌కు చెందిన బస్సు కండక్టర్ రవి సింగ్, ప్రయాణిస్తున్న నాలుగేళ్ల బాలుడు డిప్సన్ నిషాద్ అక్కడికక్కడే మృతి చెందారు. బాలుడి తల్లిదండ్రులకు తీవ్ర గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు డ్రైవర్ గోవిం ద్ ప్రసాద్‌పై నేరేడిగొండ పోలీసులు కేసు నమోదు చేశారు.


అతివేగమే అనర్థం: ఎస్పీ అఖిల్ మహాజన్

ప్రమాద స్థలాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అతివేగం ప్రాణాపాయమని, వాహనదారులు నిబంధనలు పాటించాలని సూచించారు. జిల్లాలో ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లలో ఇప్పటికే రంబుల్ స్ట్రిప్స్, సూచిక బోర్డులు ఏర్పాటు చేశామని, ఇకపై స్పీడ్ లేజర్ గన్ల ద్వారా వేగ నియంత్రణ చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ సీఐ రమేష్, ఎం.టి.ఓ హరీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ వినియోగదారులు సహకరించాలి

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆదర్శనగర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. వేసవి కాలంలో నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు చేపట్టిన 33 కేవీ టవర్ లైన్ నిర్మాణ పనులు, అలాగే సబ్‌స్టేషన్ పెయింటింగ్ పనుల కారణంగా ఈ చర్య తప్పనిసరిగా తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ అంతరాయం ఆదర్శనగర్, జీఎన్‌ఆర్ కాలనీ, ఈద్‌గాం, గాయత్రిపురం, సిద్దాపూర్, రాంనగర్, భాగ్యనగర్, సోఫీనగర్, డిమార్ట్ పరిసరాలు, సాగర్ కన్వెన్షన్ హాల్, మహ్మదీయ మసీదు, సిద్దాపూర్ వాటర్ వర్క్స్ ప్రాంతాల్లో ఉంటుంది. సమయానికి పనులు పూర్తయ్యాక తిరిగి విద్యుత్‌సరఫరా పునరుద్ధరించబడుతుందని, వినియోగదారులు సహకరించాలని విద్యుత్ అధికారులు కోరారు.

ఫొటో న్యూస్



సాయంత్రం వేళలో ఎర్రబడి కనిపించిన ఆకాశం



ఉదయం చెరువు నీటిపై కనిపించిన దృశ్యం

ఆకాశం ఎందుకో ఎర్రబడ్డది!

బజార్ హత్నూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నీలి వర్ణంలో ఉండాల్సిన ఆకాశం ఆదివారం ఉదయం సాయంత్రం వేళల్లో కొంత ఎర్రబడి కనిపించింది. బంగాళ ఖాతంలో ఏర్పడ్డ తుఫాను ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో ఉదయం బజార్ హత్నూర్ లోని చెరువు నీటిపై పసుపు వర్ణం కాంతితో పాటు సాయంత్రం వేళలో సూర్యాస్తమయం సమయంలో కూడా ఆకాశం ఎర్రబడి కనిపించింది. కళ్ళకు పసుపు, ఎరుపు, నారింజ రంగులతో ఆకాశం చూపరులకు కనువిందు చేసింది.

ఎట్టకేలకు.. ఎన్నికలు!

(5వ పేజీ తరువాయి...)

నైతం మున్సిపాలిటీ ఏర్పాటుకు అభ్యంతరాలు తెలపడంతో ప్రభుత్వం మున్సిపాలిటీ ఏర్పాటు ప్రక్రియను నిలిపి వేసింది. అప్పటికే గ్రామ పంచాయతీల ఎన్నికలు పూర్తికావడంతో ప్రభుత్వం ఉట్నూర్ మేజర్ పంచాయతీకి ఎన్నికలు నిర్వహించలేదు. ప్రభుత్వం 500 జనాభా ఉన్న గ్రామాలను గ్రామ పంచాయతీలుగా ప్రకటించడంతో ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గంగాపూర్, కన్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గంగాపూర్, కన్నాపూర్ గ్రామాల ను విడగొట్టి రెండు కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. కొత్త పంచాయతీలలో ఎన్నికలు నిర్వహించింది. కానీ, ఉట్నూర్ పంచాయతీ గత ఏడేళ్ల కాలంగా ప్రత్యేక అధికారి పాలనలో కొనసాగుతూ వస్తుంది. ఫలితంగా ఉట్నూర్ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజల సమస్యలు పరిష్కరించడానికి పాలకవర్గం లేకపోవడంతో అధికార యంత్రాంగం మాత్రం వచ్చిన నిధులతో సరిపెడుతూ అం తంత మాత్రంగా కార్యక్రమాలు చేపడుతూ వచ్చారు.

ఉట్నూర్ తొలి సర్పంచ్‌గా సాడిగే చిన్న రాజన్న

1959లో ఏర్పడిన ఉట్నూర్ గ్రామ పంచాయతీకి ప్రథమ సర్పంచ్‌గా సాడగే చిన్న రాజన్న, రెండవ సర్పంచ్‌గా హందిచావుష్, మూడవ సర్పంచ్‌గా తాజోద్దిన్, నాల్గవ సర్పంచ్‌గా మూతిపెద్దులు ఎన్నికయ్యారు. ఆ తర్వాత సర్పంచ్ స్థానాన్ని గిరిజనులకు రిజర్వు చేయడంతో గిరిజనేతరులు సర్పంచ్ ఎన్నికలను బహిష్కరిస్తామని ప్రకటించారు. దీంతో సర్పంచ్ స్థానానికి ఎవ రూ నామినేషన్లు వేయకపోగా కేవలం వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహించి ఉప సర్పంచ్‌గా ఎన్నికైన లోక సుదర్శన్‌రెడ్డి సర్పంచ్‌గా కొనసాగారు. ఆ త ర్వాత జరిగిన ఎన్నికల్లో ఆరవ సర్పంచ్‌గా రాథోడ్ వెంకట్రావు, ఏడవ సర్పంచ్‌గా బొంత ఆశ, ఎనిమిదో సర్పంచ్‌గా బొంత ఆశారెడ్డిలు ఎన్నికయ్యారు. 2018-19 ఎన్నికలు నిలిచిపోవడంతో ఏడేళ్ల కాలంగా పంచాయతీకి పాలక వర్గం కరువయ్యింది.

ముగిసిన నామినేషన్లు

ఎట్టకేలకు ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలకు పూనుకోవడంతో ఉట్నూర్ మేజర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి కోసం ఇటీవల సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన లక్కీ డ్రాలో గిరిజన మహిళలకు రిజర్వు చేయబడింది. మూడు రోజులుగా సర్పంచ్ స్థానంతో పాటు 18 వార్డు సభ్యుల ఎన్నికల కోసం ఎన్నికల అధికారులు నామినేషన్లు స్వీకరిస్తున్నారు. ఉట్నూర్ మేజర్ పంచాయతీ సర్పంచ్ పదవి కోసం భారీగానే కొనసాగిన నామినేషన్ల పర్వం శనివారం ముగిసిపోగా.. 16 మంది మహిళా అభ్యర్థులు ఉట్నూర్ సర్పంచ్ స్థానానికి నామినేషన్లు సమర్పించారు. నామినేషన్ల ఉప సంహరణ చివరి వరకు ఎంత మంది పోటీలో ఉంటారోనని? పరిశీలకులు అంటున్నారు.

రెండో విడత.. నామినేషన్ కేంద్రాల పరిశీలన

(5వ పేజీ తరువాయి...)

ఆదివారం నాలుగు సర్పంచ్ పదవులకు, నాలుగు వార్డు మెంబర్‌లకు నామినేషన్‌ల పత్రాలు దాఖలు అయినట్లు సాత్నాల మండల ఎంపీడీవో వెంకట్‌రాజ్ తెలిపారు. అదే విధంగా బేల మండలంలోని ఆరుక్లస్టర్‌లకు5 సర్పంచ్ పదవులకు 3 వార్డు మెంబర్‌లకు నామినేషన్ పత్రాలు ఆదివారం దాఖలు అయినట్లు బేల ఎంపీడీవో ఆంజనేయులు తెలిపారు.

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని గ్రామపంచాయతీలకు రెండో విడతలో భాగంగా ఆదివారం నామినేషన్‌లు మొదలవగా, మందకోడిగా నామినేషన్‌లు దాఖలు అయ్యాయి. ఆదిలాబాద్ రూ రల్ మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉండగా దీనికిగాను 8 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. యాపల్‌గూడ సర్కిల్ నుంచి కుంభఝరి గ్రామానికి గాను సర్పంచ్‌కు ఒక నామినేషన్ వేయగా, తంతోలి సర్కిల్ నుంచి కచ్‌కంటికి సర్పంచ్‌కు 2, వార్డ్ మెంబర్‌కు ఒకరు నామినేషన్‌లు వేశారు. అలాగే పొచ్చెర సర్కిల్ నుంచి ఒకరు, భీంసరి గ్రామానికి ముగ్గురు సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేయగా, అంకోలి సర్కిల్ నుంచి ఒకరు వార్డు మెంబర్‌కు నామినేషన్, జందాపూర్‌కు ఇ ద్దరు, అంకోలి వార్డు సభ్యునికి ఒకరు, లాండసాంగ్వి సర్పంచ్‌కు ఇద్దరు నామినేషన్‌లు వేశారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే



వినేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం పలువురు బాధితులను పరామర్శించా రు. అనారోగ్య సమస్యలతో నిర్మల్ పట్టణంలోని ఆదిత్య ఆస్పత్రిలో చికిత్స పొందుతు న్న నేరడిగొండ మండలంలో ని ఇస్పూర్ గ్రామానికి చెం దిన జాదవ్ వినేశ్, ఇచ్చోడ మండలం కొకస్ మన్నూర్ గ్రామానికి చెందిన బీ ఆర్ఎస్ నాయకుడు వినోద్ అత్తమ్మ నాగమణి అనారోగ్యంతో చికిత్స పొం దుతున్న విషయం తెలుసుకొని ఎమ్మెల్యే పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైద్యులతో మాట్లాడి, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వారికి ధైర్యం చె ప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు బిగ్ షాక్


» కాంగ్రెస్‌లో చేరిన పల్లి(కె) మాజీ సర్పంచ్, కల్లెం రమేష్‌రెడ్డి
» యువజన సంఘాల సభ్యులు



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న పల్లి(కె) మాజీ సర్పంచ్ కల్లెం రమేష్‌రెడ్డి, యువజన సంఘాల సభ్యులు


తలమడుగు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తలమడుగు మండలంలో బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. ప్రస్తుతం మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతుండడంతో మండలంలోని పల్లి(కె) గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సినీయర్ నాయకులు, మాజీ సర్పంచ్ కల్లెం రమేష్‌రెడ్డి, యూత్ నాయకులు ఎల్మా శ్రీకాంత్ రెడ్డి, గంగం భూమారెడ్డి, గ్రామ యువజన సంఘాల సభ్యులు ఆదివారం డీసీసీ ప్రెసిడెంట్ నరేష్ జాదవ్, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, మాజీ ఎంపీ సోయం బాపూరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం అధికార పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి, లైబ్రరీ చైర్మన్ మల్లెపూల నరసయ్య, మాజీ జడ్పీటీసీలు గోక గణేష్ రెడ్డి, బాబన్న, నాయకులు ప్రకాష్ రావు, మాజీ ఎంపీటీసీ మాధవ్. భూమారెడ్డి. రాజారెడ్డి. లింగారెడ్డి. ఆదిరెడ్డి అశోక్ పాల్గొన్నారు.

ఎస్టీయూ ప్రధాన కార్యదర్శికి సన్మానం



కుంటాల గజ్జలమ్మ ఆలయ ప్రాంగణంలో జుట్టు గజేందర్‌ను సన్మానిస్తున్న పలువురు

కుంటాల, నవంబరు 30: (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండల వాస్తవ్యులు జుట్టు గజేందర్ స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా ఇటీవల ఎన్నికైన సందర్భంగా ఆయనను ఆదివారం మండల కేంద్రం కుంటాల గజ్జలమ్మ ఆలయ ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ప్రభుత్వంతో చర్చించి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధించి పదోన్నతులు ఇప్పించడంతో గజేందర్ ఎంతో కృషి చేశారన్నారు. సీపీఎస్ రద్దు కోసం ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్.భూమన్న యాదవ్, జుట్టు లక్ష్మణ్, ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ జుట్టు అశోక్ తో పాటు నాయకులు మహేందర్, వెంకటేష్, తాటి మహేష్, కృష్ణారావు, జుట్టు సుధాకర్, తదితరులు ఉన్నారు.



భీమన్న..గీ ఎలచ్చన్లు గమ్మత్తుగా ఉన్నాయే..!

ముథోల్,నవంబరు 30(ఆంధ్రజ్యోతి):స్థానిక సం స్థల ఎన్నికలు జిల్లాలో మూడు విడతల్లో జరుగనున్న నేపథ్యంలో మొదటి విడతకు సంబంధించిన నామినేషన్ ప్రక్రియకొనసాగుతుంది.అయితే ప్రచారం రోజురోజు ఊపందు కుంది. ఆయా పార్టీల నాయకులు తమ తమ అనుచరగణాన్ని బరిలోదించి గెలుపే లక్ష్యంగా ఎత్తుకుపై ఎత్తులు వేస్తే ఓటరును మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. తమకే ఓటు వేయాలని ప్రాధేయపడుతున్న తరుణంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన రచ్చబండ ముచ్చట్లు...

భోజన్న:అన్న భీమన్న గీఎలచ్చన్ల పండుగ మొదలైంది. ప్రతి పెద్ద మనిషి నాకు ఓటు వేయు, మా పోరడికి పట్టం కట్టుండి. ఊరు బాగు చేత్తరు. ఆ మీగల్లీలో మీటింగ్‌లు పెడుతుంద్రు. మీ కులం మద్దతు కావాలే అంటుంద్రు..ఎవలికి ఓటు గుద్దాలో ఎవరికి దించాలో ఏమిసమజ్ అవతలేదు అన్న.

భీమన్న: తమ్మి కాలం మారింది... నాయకులు మారుతుంద్రు... జనాలు మారు తుంద్రు... మొన్న మన గల్లీలోగా పార్టీ వాళ్ల నుంచి పక్క గల్లీ నుంచి సర్పంచ్‌గా పోటీ చేస్తున్నా అని మొన్న మీటింగ్ పెట్టినప్పుడు..మనగల్లీ పోర గాళ్లతో పాటు అందరూ గాళ్ల గంటపాటు మాట్లాడి వెంటనే మీటింగ్ వచ్చిన కొందరికి దావత్ ఇచ్చినారట..నిన్న మనపక్క గల్లీలో వేరే వారు మీటింగ్ పెడ్తే..దిగే మనుషులకు అదిఇస్తాం.ఇది ఇస్తాం. సంఘ భవనం కట్టిస్తాం.

భోజన్న:అన్నఎవరు గెలుత్తారు... ఎవలికి సమజ్ అవుతలేదు. ఈ మనుషులు అర్థం కావటం లేదు. ఇప్పుడు గిట్లనే అంటారు. పోయిన ఎలచ్చన్లగా లచ్చన్నకు సర్పంచ్‌గా గెలిపిస్తిమి.. ఏం జేసింద్రు..రోడ్డు వేయుమని చెప్పులు అరిగే దాక తిరిగితిమి.. మన తిప్పలు తీరలేదు. ఆ రోడ్డు గట్లనే పాడాయే.

భీమన్న:లీడర్లే పూటకొక్కపార్టీ మారుస్తూ పదవి కోసం ఎత్తుకుపై ఎత్తుఏస్తూ గద్దెకెక్కిన తర్వాత మన సమస్యలు పట్టనట్టు నటన జేయవట్టిరి. మరి గీ ఎలచ్చన్ల కూడా మబ్బే పెట్టేందుకు వస్తుంద్రు. మనంగూడ అందరికిగా లెక్కేజై కొట్టాలే...అందరిచ్చినయి తినాలే.. ఆపదలో ఆదుకున్నోడికి ఓటు వేయాలే.. ఊరు మంచిగా ఏలేటోడికి పట్టం గట్టాలే.

భోజన్న:మరిపోరగాళ్లు..గాళ్లు ఇచ్చే..గీ..విందు.. మందుకు ఆశపడి పాడు గావట్రీ కదా.

భీమన్న:నీవన్నది కూడా నిజమే.కానీగీ.. మాట అందరూ ఆలోచిస్తేగా తాయిలాలు మనకెందుకే... మీరిచ్చే మద్యం, డబ్బు వద్దు... మా ఊరు అభివృద్ధి మా సమస్యలు తీర్చే నాయకుడికి పట్టం కడుతాం అని ప్రశిస్తే గప్పుడు గసుంటి నాయకుల మైండ్ దిమ్మదిరిగి.. గసుంటి ఏశాలు ఎయ్యక ఇంటికాడ గుసుంటారు.

భోజన్న:సమజ్ అయ్యింది.గాళ్లు మనసంఘం తో మీటింగ్ పెట్టినప్పుడు ఏ పార్టీ నా యకుడు రాని మాకు మీరిచ్చే పైసలు వద్దు... గిప్పటి దాకా మస్తు జూసినం.... మాకు పని చేసే నా యకుడు తెలుసు...నట్టేట ముంచే నా యకుడు తెలుసు... ఆ తేదీన ఏ నాయకుడికి వే యాలో గాళ్లకు ఓటు వేస్తాం..గీసుంటి ఎత్తులు పై ఎత్తు లు మా దగ్గర నడువై అని జెప్తా.

భీమన్న: హ..గిదే మన ఓటర్లు అందరూ గిట్ల జేస్తే..మంచి నాయకుడు వత్తాడు. మంచి పాలన ఉంటది.సరే పొలంకాడికి పోయత్తా. రాత్రి మన సంఘం మీటింగ్‌లో కలుస్తా. సరే అన్న పయిలం యాదిపెట్టుకో..

హాయ్..సర్పంచ్‌గా పోటీ చేస్తున్నాను

» సోషల్ మీడియా వేదికగా ప్రచార పర్వం

భైంసా, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సర్పంచి ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ రెండవ విడతకు చేరుకుంది. సర్పంచ్ పదవులకు పోటీ చేస్తున్న వారంతా ఈ సారి సోషల్ మీడియానే తమ ప్రచారాలకు మార్గంగా ఎంచుకున్నారు. గ్రామాల్లో ఉండే వాట్సప్ గ్రూపులను ఎంచుకొని వాటిలో తమ ఫొటోలు అప్‌లోడ్ చేసి ప్రచారం ప్రారంభించారు. తాను సర్పంచ్‌గా పోటీ చేస్తున్నానని, తమను గెలిపిస్తే సమస్యలు పరిష్కారిస్తానంటు తాయిలాలు ప్రకటిస్తూ హామీలు గుప్పిస్తున్నారు.కొందరైతే ఏకంగా హామీల జాబితానే గ్రామంలోని గ్రూపులో పోస్టు చేసి విజ్ఞప్తులు చేస్తున్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో వాట్సప్ గ్రూపులు నాయకుల ప్రచారాలతో నిండిపోతున్నాయి.

క్రైం సమాచారం

నామినేషన్.. వేసిన వార్డు సభ్యురాలి మృతి



జమున (ఫైల్)

మామడ,నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మామడ మండలంలో విషాదం చోటుచేసుకుంది. పొన్కల్ గ్రామానికి చెందిన దుబ్బాక జమున(45) శని వారం గ్రామంలో 12వ వార్డు సభ్యురాలిగా పోటీ చేసేందుకు నామినేషన్ దాఖలు చేసింది. దురదృష్ట వశాత్తు ఆదివారం గుండెపోటుతో మృతి చెందింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రూ.రెండు లక్షల సైబర్ మోసం

బోథ్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రానికి చెందిన ఓ రిటైర్ట్ ఏఎన్ఎం ప్రజలంతా సైబర్ నేరగాళ్ల వలలో పడి రెండు లక్షల రూపాయలు పోగొట్టుకుంది. మీ క్రెడిట్ కార్డు అప్డెట్ కాలేదని వాట్సాప్ ఫోన్‌కాల్‌లో మాట్లాడిన వారు ఆమెకు వచ్చిన లింకు వివరాలు తెలపాలని కోరడంతో వివరాలు తెలిపింది. దీంతో ఆమె అకౌంట్లో నుంచి శుక్రవారం దశల వారీగా రూ.2లక్షల డ్రా చేసుకున్నట్లు గమనించింది. దీంతో తాను మోసపోయానని గమనించి స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఏది ఏమైనా సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా పోలీసులు ఎన్ని రకాల సూచనలు చేస్తున్న మోసగాళ్ల భారీన పడి డబ్బులు పోగొట్టుకుంటున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

» సుర్జాపూర్‌లో విషాదం



వెంకట్రాములు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాహుల్ గైక్వాడ్

ఖానాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పంట చేనుకు నీళ్ల పెట్టేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై ఓరైతు మృతి చెందిన ఘటన ఖానాపూర్ మండలం సుర్జాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి చెందిన రైతు పన్నెల వెంకట్రాములు(49) గ్రామ శివారులోని తన పంట పొలాన్ని ఆనుకుని మరో ఆరు ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. కౌలు చేస్తున్న భూమిలో మొక్కజొన్న పంట వేశాడు. మొక్కజొన్నకు నీళ్ల పెట్టేందుకు శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో పంట చేనులోకి వెళ్లాడు. ఈ క్రమంలో విద్యుత్ మోటార్ స్టార్ట్ చేసే సమయంలోనే విద్యుత్ షాక్‌కు గురై వెంకట్రాములు అక్కడి కక్కడే మృతి చెందాడు. పది రోజుల క్రితం అయ్యప్ప మాల ధరించిన వెంకట్రాములు ఆలయంలోనే ఉంటున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు శనివారం రాత్రి ఫోన్ చేసినప్పటికీ ఎత్తకపోవడంతో పూజలో ఉన్నాడేమో ననుకున్నారు. ఆలయంలో తోటి భక్తులు సైతం ఫోన్ చేసినప్పటికీ వెంకట్రాములు ఎత్తకపోవడం, ఆదివారం ఉదయం కూడా పూజకు రాకపోవడంతో అనుమానం వచ్చి తోట వద్దకు వెళ్లి చూడగా వెంకట్రాములు విగతజీవిగా పడి ఉన్నాడు. ఇది గమనించిన వారు పోలీసులకు, గ్రామస్థులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలాన్ని ఎస్సై రాహుల్ పరిశీలించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైపేర్కొన్నారు. వెంకట్రాములు చేతి వేళ్లకు విద్యుత్ షాక్‌తో కాలిన గాయాలు గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు. వెంకట్రా ములుకు భార్యఉమా, కూతురు నిషిత, కుమారుడు నితీష్‌లు ఉన్నారు. విద్యుదాఘాతంతో రైతు వెంకట్రాములు మరణించడంతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. వెంకట్రాములు మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు రోధించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని పలువురు కోరుతున్నారు.

చలి తీవ్రతతో జనం విలవిల

» చలి తీవ్రతతో పడిపోతున్న ఉష్ణోగ్రతలు » ఇబ్బంది పడుతున్న జనం



భైంసాలో చలి మంటలు కాగుతున్న జనాలు

భైంసా, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చలి తీవ్రత రోజు రోజుకు పెరుగుతోంది. చలి దాటికి తట్టుకోలేక జనాలు విలవిలలాడిపోతున్నారు. ప్రధానంగా వృద్ధు లు, చిన్న పిల్లలు అవస్థలు పడుతున్నారు. ఉదయం వేళలో కమ్ముకుంటున్న తట్టమైన పొగమంచు, దినం వేలో చల్లని శీతలగాలుల బెడదతో బెంబేలెత్తిపోతున్నారు. ఆదివారం జిల్లాలో దినం వేళలో ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల సెల్సియస్ నమోదు అవ్వగా రాత్రి పూట 13 డిగ్రీలకు పడిపోయాయి. సాయం త్రం 4 గంటల నుంచి మొదలవుతున్న చలి గాలుల బెడత ఉదయం 11 గంటల వరకు కొనసాగుతోంది.పగటి వేళల్లోనూ చలి తీవ్రత కొనసాగుతోంది. ఈ క్రమంలో మార్కెట్లలో జనాల రాకపోకలు తగ్గిపోయాయి. విద్యా సంస్థలకు వెళ్లే విద్యార్థులు, విధుల నిర్వాహణకు కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు చలితో గజగజ వణికిపోతున్నారు. వెచ్చని దుస్తులు ధరించి రాకపోకలు చేపడుతున్నారు. వృద్దులు, చిన్నారులు ఇళ్లలో నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇక ఉదయం, రాత్రి వేళలో అన్ని ప్రాంతాల్లోనూ జనాలు చలి మంటలు కాచుకుంటున్నారు. చలి తీవ్రతతో జలుబు, జ్వరాలు, శ్వాస సంబంధిత స మస్యలు పెరిగే అవకాశం ఉండటంతో వైద్యులు ఆరోగ్య రక్షణ చర్యలు పా టించాలని సూచిస్తున్నారు.

అటవీశాఖను వేధిస్తున్న సిబ్బంది కొరత

» ఇబ్బంది పడుతున్న సిబ్బంది



బోథ్‌లోని అటవీశాఖ కార్యాలయం

బోథ్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):బోథ్ రేంజ్ పరిధిలోని అటవీశాఖ పరిధిలో సిబ్బంది కొరత వేదిస్తున్నది. ఫలితంగా విధులు నిర్వహించే సిబ్బందికి పని ఒత్తిడి పెరగడంతో ఆందోళన చెందుతున్నారు.16 మంది బీట్ ఆఫీసర్ ఉండాల్సిన రేంజ్ కార్యాలయంలో కేవలం నలుగురు మందే విధులు నిర్వహిస్తున్నారు. కింది స్థాయిలో విధులు నిర్వహించాల్సిన సిబ్బంది లేక పోవడం వల్ల అడవుల్లో జరిగే అక్రమాలపైన ఆశించిన స్థాయిలో విధులను నిర్వహించ లేక పోతున్నారు.

నలుగురికి పనులు ఎన్నో...

అటవీ శాఖ కార్యాలయంలో నాలుగు సెక్షన్లు ఉండగా సెక్షన్ ఒక సెక్షన్ ఆఫీర్‌ను ప్రభుత్వం నియమించింది. అయితే రాత్రిపూట నలుగురు సెక్షన్ ఆఫీసర్ల తో కలిసి నలుగురు బీట్ ఆఫీసర్లు కలప అక్రమ రవాణాపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అయితే సిబ్బంది కొరత వల్ల ఆశించిన స్థాయిలో పెట్రోలింగ్ చేయలేక పోతున్నామని సిబ్బంది వాపోతున్నారు.వీరికి తోడు మరికొన్ని పనులు చేయడం సిబ్బందికి భారంగా మారింది. అర్బన్ పార్కులో విధులు నిర్వహించడం తో పాటు వాటర్ఫాల్ వద్ద విధులు నిర్వహించాల్సి వస్తున్నది. మరోవైపు సరిహద్దుల్లో ఉన్న ఘన్నూర్,నిగిని గ్రామం సమీపంలో ఉన్న చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వహించడం భారంగా మారింది.ఒక్కో బీట్ ఆఫీసర్‌కు నాలుగేసి బీట్లు ఇన్‌చార్జీ ఉండడంతో పర్యవేక్షణ భారంగా మారింది.

వన్యప్రాణుల పై పర్యవేక్షణ...

బోథ్ అడవులలో ఉన్న వన్యప్రాణాలను పరిరక్షించడంతో పాటు ఈ రేంజ్ పరిధిలో తిరుగుతున్న చిరుతలు పులులను పరిరక్షించాల్సిన బాధ్యత అటవీశాఖ సిబ్బంది పనే ఉంది.అయితే వీరికి తోడు కొంత మంది తాత్కాలిక సిబ్బంది సహకారం అందించడం వల్ల అడవి పై నిఘా వేస్తున్నారు. తాత్కాలిక సిబ్బంది లేక పోతే అడవుల పరిరక్షణగారికి వదిలేసినట్లే అవుతుందని పరిశీలకులు అంటున్నారు. ఏది ఏమైనా ఖాళీగా ఉన్న అటవీశాఖ సిబ్బంది పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

ఘనంగా ఆరట్టు ఉత్సవం





అయ్యప్ప స్వామి పల్లకిని మోస్తున్న ఎమ్మెల్యే పాయల్‌శంకర్, మాజీ మంత్రి జోగురామన్న - పల్లకి సేవ నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

» జిల్లా కేంద్రంలో శోభాయాత్ర

» పెన్‌గంగలో స్వామికి చక్రతీర్థ స్నానం

» హారతులతో స్వాగతించిన మహిళా భక్తులు

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):హరిహరసుతుడు,మణికంఠుడు అయ్యప్పస్వామికి ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఘనంగా ఆరట్టు నిర్వహించారు. హరిహరసుతుడు అయ్యప్ప స్వామికి ప్రీతికరమైన ఈఆరట్టు ఉత్సహం జిల్లా కేంద్రంలో శోభాయమానంగా సాగింది. తెల్లవారు జామున స్థానిక శ్రీరామచంద్ర గోపాల కృష్ణమఠం వద్ద నుంచి చేపట్టిన ఈఆరట్టు ఉత్సవాన్ని మఠాధిపతి యోగానంద సరస్వతి ముఖ్య అతిథిగా హాజరై స్వామి నగర సంకీర్తనను ప్రారంభించారు. అనంతరం అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని అందంగా అలంకరించిన భక్తులు పల్లకిలో ఉంచారు. వేలాది మంది దీక్ష దారుల శరణుగోశల మధ్య పట్టణ ప్రధాన వీధుల మీదుగా నగర సంకీర్తనను కొనసాగించారు. ఈ సందర్భంగా పట్టణ పురవీధుల గుండా స్వామి పల్లకి సేవ శోభాయాత్ర కనులవిందుగా ముందుకు సాగింది. ఇందులో భాగంగా ఆయాకాలనీలోని మహిళా భక్తులు పెద్దఎత్తున రంగవళ్లులు వేసి హారతులతో స్వామిపల్లకికి ఘన స్వాగతం పలికారు. కాగాఅయ్యప్పస్వామి దీక్షాపరులు స్వామిని స్మరిస్తూ ఆయన నామస్మర ణంతో పల్లకి సేవతో ముందుకు సాగారు. నగర సంకీర్తన శ్రీగోపాలకృష్ణ మఠం నుంచి అశోక్‌రోడ్, బ్రహ్మణవాడ,శివాజీచౌక్,పలుకాలనీల గుండా పెన్‌గంగా నదితీరానికి చేరుకుంది.అనంతరం పెన్‌గంగా నదిలో అయ్యప్పస్వాములు స్వామి ఉత్సవవిగ్రహానికి చక్రతీర్థస్నానం, మంజలి పట్టాభిషేకం నిర్వహించారు.కాగాకేరళ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన డోలువాయిద్యాలు వేడుకల్లో ఆకర్షణగా నిలిచాయి.ఇందులో గురుస్వాములు గణేష్‌గురుస్వామి,తిప్పర్తిసత్యం గురుస్వామి, లక్ష్మణ్‌గురుస్వామి,అయ్యప్ప భక్తులు తదితరులున్నారు.పెద్దఎత్తున వైభోపేతంగా నిర్వహించిన ఈఆరట్టు ఉత్సవానికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్, మాజీ మంత్రి జోగురామన్నలు హాజరై పల్లకి సేవలో పాల్గొని పాటలు ఆలపించి నృత్యాలు చేశారు.

తొలి రోజు నామినేషన్లు దాఖలు

సారంగాపూర్/నర్సాపూర్(జి)/లోకేశ్వరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలిరోజయిన ఆదివారం రెండవ విడుతలో భాగంగా నిర్మల్ జిల్లాలోని నిర్మల్ గ్రామీణం సారంగాపూర్, సోన్, దిలావర్‌పూర్, నర్సాపూర్(జి), లోకేశ్వరం, కుంటాల మండలల్లో 131 గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాలకు 199 నామినేషన్లు దాఖాలు కాగాగ్రామపంచాయతీలో ఉన్నటువంటి 1170 వార్డు సభ్యులకు స్థానాలకు 122 నామినేషన్లు దాకాలయ్యాయి. దీంతో నామినేషన్ కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండడానికి జిల్లా ఎస్పీ జానకీ షర్మీల గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

తొలి రోజు నామినేషన్లు దాఖాలు

పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలిరోజయిన ఆదివారం రెండో విడుతలో భాగంగా సారంగాపూర్ మండలంలో 32 గ్రామపంచాయతీల్లో 32 గ్రామసర్పంచ్‌లకు గాను 31 నామినేషన్లు, 282 వార్డులకు గాను 36 నామినేషన్లుదాఖలు అయినట్లు ఎంపీడీవో తెలిపారు.

నర్సాపూర్(జి)లో నామినేషన్ల జోరు

తొలి రోజు 9సర్పంచ్ మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ తొలిరోజు నుంచే వేగం పుంజుకుంది. సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేసేందుకు అభ్యర్థులు పెద్ద ఎత్తున తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

సర్పంచ్ పదవికి 9 నామినేషన్లు

మండల కేంద్రంలోనే ముగ్గురు అభ్యర్థులు సర్పంచ్ పదవికి బరిలోనిలిచారు.గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి, కట్కం అజయ్ కుమార్, బర్కుంట నరేందర్. ఇతర క్లస్టర్ల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో నామినేషన్లు వేసి వారి వివరాలు ..చాక్‌పల్లి క్లస్టర్‌లో అర్లీ(కే) గ్రామం నుంచి జంధ్యాల మురళి, చాక్‌పల్లి గ్రామం నుంచి సతీష్, మ్యాదరి లక్ష్మీ నామినేషన్లు వేశారు. గొల్లమాడ క్లస్టర్‌లో బూరుగుపల్లి(జి) గ్రామ పంచాయతీ నుంచిజాదవ్ కిషోర్ నామి నేషన్ దాఖలు చేశారు. రాంపూర్ క్లస్టర్ లో అంజనీ తండా గ్రామ పంచాయతీకి జాద వ్ శ్రీనివాస్, హరిలాల్ నామినేషన్లు వేశారు.



నామినేషన్లు వేస్తున్న అభ్యర్థులు

వార్డు సభ్యుల హోరాహోరీ

వార్డు సభ్యుల పదవులకు కూడా మొదటి రోజున మొత్తం 16 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నర్సాపూర్(జి) క్లస్టర్‌లో 1 నామినేషన్.మొదటిరోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

నామినేషన్ వేసి సర్పంచ్ అభ్యర్థులు

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామ పంచాయతీలలో ఆదివారం 25 గ్రామ పంచాయతీలకు గాను 23 సర్పంచ్ అభ్యర్థులు, నాలుగు వార్డు సభ్యులు నామినే షన్ వేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో సల్మాన్ రాజ్, కార్యదర్శి, ఎన్నికల సిబ్బంది, పాల్గొన్నారు.

చలిలో.. ఓట్ల కోసం పాట్లు

» నామినేషన్ల పర్వం షురూ

కాకన్న ముందే నాయకుల ఆరాటం

ముథోల్,నవంబరు30(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో ఎన్నికల సందడి-ఆశావాహుల్లో పరుగులు పెట్టిస్తుంది.పంచాయతీ ఎన్నికల వేళ గ్రామాల్లో రాజకీయ సందడి ఉరకలేస్తోంది. చలి ఉదయం మొదలయ్యే నాటికే ఆశావాహులు, పోటీకి దిగే అభ్యర్థులు ఓటర్ల ఇళ్లకు వెళ్లి పలకరింపులు మొదలుపెట్టారు. తమకు అనుకూలంగా ఓట్లు వేయమని కోరుతున్నారు. ముథోల్ మండలంలోని 19 గ్రామ పంచాయతీలున్నాయి. డిసెంబరు 3 నుంచి నామినేషన్ల స్వీకరణ ఘట్టం ప్రారంభం కానుంది. పోటీ చేసే అభ్యర్థులు గ్రామాల్లో ఉదయం నుండే ఓటరు దేవుళ్లను దర్శించుకుంటున్నారు. మరి కొందరు రహస్యంగా సమావేశాలు ఏర్పాటు చేసి యూత్ సభ్యులకు, సంఘాలకు నజరానాలు ఇచ్చేందుకు మాట ఇస్తున్నట్లు తెలుస్తుంది. తమకు అనుకూల వాతావరణం కల్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు కొందరు అభ్యర్థులు ప్రత్యేక పద్ధతులను కూడా అవలంబిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రామాల్లో పోటీ మరింత పెరిగింది. కొన్ని గ్రామాల్లో అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో పోటీ తీవ్రంగా మారే అవకాశం ఉందని రాజకీయ కురువృద్ధులు అంటున్నారు.పంచాయతీ సర్పంచ్ పదవులను సాధించేందుకు ఆవావాహులు ఎత్తుగడలు వేసి ఓటర్లను ఒప్పించే ప్రయ త్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఎన్నిక లు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో రాజకీ య చర్చలు, దావత్‌లు, మద్దతు ఇవ్వాలని వేడుకో లు, సర్పంచ్‌కు పోటీ చేసే అభ్యర్థులు ప్రణా ళికతో ముందుకెళ్తున్నారు.ఎన్నికల జోష్ రోజు రోజుకు పెరుగుతున్నాయి.పల్లెల్లోజీపీ పండుగరసవత్తంగా కొనసాగుతుందని చెప్పుకోవచ్చు.

ఉపసర్పంచ్‌ను ఎలా ఎన్నుకుంటారు ?

ఇచ్చోడ,నవంబరు,30 (ఆంధ్రజ్యోతి):గ్రామపంచాయతీలో సర్పంచ్ ప్రథమ పౌరుడు. పాలకవర్గంలో ఆ తర్వాతి స్థానం ఉప సర్పంచికి దక్కుతుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి చేసి సర్పంచి, వార్డు సభ్యుల ఫలితాలు ప్రకటిస్తారు. రిటర్నింగ్ అధికారి ఉపసర్పంచి ఎన్నికకు నోటిఫికేషన్ జారీచేస్తారు.ఎన్నిక సమయాన్ని నిర్ధేశిస్తారు.నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచి,వార్డుసభ్యులు సమావేశం అవుతారు. వార్డు సభ్యుల్లోని ఒకరిని ఉపసర్పంచిగా ఎన్నిక ప్రక్రియ చేపడతారు. ఈ సందర్భంగా సమావేశానికి వార్డు సభ్యుల కోరం అవసరం ఉంటుంది. వార్డు సభ్యుల్లో ఒకరు ఉపసర్పంచ్ అభ్యర్థిని ప్రాతిపాదిస్తే మరోకరు బలపరుస్తారు. వార్డుసభ్యులు చేతిని పైకెత్తడం ద్వారా ఎన్నిక జరగుతుంది. మెజారీటీ పొందిన వార్డు సభ్యుడిని రిటర్నింగ్ అధికారి ఉప సర్పంచిగా వెల్లడిస్తారు. ఎన్నిక సందర్భంగా కోరం లేకపోతే ఎన్నికను మరునాటికి వాయిదా వేసి నిర్వహిస్తారు. ఒకవేళ పోటీపడిన ఇరువురికి సమాన ఓట్లు దక్కిన సందర్భాల్లో వార్డు సభ్యుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి నాణెంతో టాస్ వేసి ఉప సర్పంచును నిర్ణయిస్తారు.

సాయిలింగిలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

» సుదర్శన మహా యజ్ఞాన్ని ప్రారంభించిన వేద పండితులు



సాయిలింగి ఆలయంలో మహా యజ్ఞాన్ని ప్రారంభిస్తున్న వేద పండితులు

తలమడుగు,నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిలింగి గ్రామంలో గల సాయిబాబా ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వేద పండితులతో బ్రహ్మోత్సవాల సందర్భంగా సుదర్శన మహాయజ్ఞనీ పండితులు మంత్ర ఉచ్చారణ మధ్య ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దెబ్బ అశోక్ మాట్లాడుతూ..గ్రామంలో ఆలయం నిర్మించిన నాటి నుంచి నేటి వరకు ప్రతి సంవత్సరం వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు ఇందులో భాగంగా ఈ సంవత్సరం సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేయమన్నారు. ఐదురోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలు భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా డిసెంబరు 4నయజ్ఞ పూర్ణహుతి సాయి బాబా పల్లకి ఊరేగింపు, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

తలమడుగు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలవేళ ముమ్మరంగా వాహనాలను ఎస్సై రాధిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా 50 వేల పైగా నగదు తరలించవద్దన్నారు. ఎవరైనా వాహనాల్లో మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా వాహన పత్రాలు తప్పనిసరిగా ఉంచుకోవాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వాహనాలకు జరిమానా విధించారు. ఇందులో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వానరాల భయం.. అభయం ఇస్తే జయం

» కోతులు వార్డులో లేకుండా చేసిన వారికి మా ఓటు





గుంపులు గుంపులుగా సంచరిస్తున్న కోతులు

ఇచ్చోడ, నవంబరు, 30 (ఆంధ్రజ్యోతి) : గుంపులు గుంపులుగా ఉన్న వానరాలు గ్రామపంచాయతీ ఎన్నికల అభ్యర్థులకు దడ పుట్టించనున్నాయి. కొంత కాలంగా ఇచ్చోడ మండల కేంద్రంలో వానరాలు(కోతులు) గుంపులు గుంపులుగా తిరుగుతూ బీభత్సం సృష్టిస్తున్నాయి. గతంలో ఒకటి రెండు ఉండే కోతులు ఇప్పుడు వందల సంఖ్యల్లోకి వచ్చేశాయి. నిత్యం ఇళ్లు, దుకాణాలు, హోటళ్లచుట్టూ తిరుగుతూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.వాటి బారినపడ్డ చాలా మందికి గాయాలయ్యాయి త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఈ కోతులను తరిమిన వారికే ఓటు అనే నినాదం ప్రారంభమైంది. ఓటరు ఆయుధానికి అభ్యర్థుల అభయమే మిగిలింది.వార్డు సభ్యులకు ఈఎన్నికల్లో కోతుల లొల్లి ఎక్కువైందని చెప్పుకొవచ్చు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.0 / కనిష్ఠం 8.2
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
సోమవారం 1 డిసెంబరు 2025



చలి.. పులి!!



దట్టమైన పొగమంచుతో కమ్ముకున్న పట్టణ పరిసర ప్రాంతం

● ఉట్నూర్ పట్టణం



ఎట్టకేలకు... ఎన్నికలు!

- ఏడేళ్ల తర్వాత ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీకి ఎన్నికలు
- 2018-19లో మున్సిపాలిటీ వివాదంతో నిలిచిన ఎన్నికలు
- మరుగునపడ్డ అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు
- ప్రస్తుతం ముగిసిన నామినేషన్ల పర్వం
- గిరిజన మహిళకు రిజర్వు.. సర్పంచ్ స్థానానికి 16 మంది నామినేషన్
- ఉట్నూర్ పంచాయతీలో 12,622 మంది ఓటర్లు కాగా.. 6,237 మంది పురుషులు, 6385 మంది మహిళలు
- 1959లో ఉట్నూర్ గ్రామ పంచాయతీ తొలి సర్పంచ్‌గా చిన్న రాజన్న

ఉట్నూర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించాక ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీకి నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లో బొంత ఆశారెడ్డి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేశారు. ఆయన హయాంలోనే ఉట్నూర్ పట్టణ ప్రజల కోసం వారానికి ఒకసారి మాత్రమే ఆదివారం సంత కొనసాగుతున్నందున.. వారానికి రెండుసార్లు వారసంత నిర్వహిస్తే బావుంటుందని భావించి పాత బస్టాండ్ ప్రాంతంలో గురువారం మినీ అంగడిని ప్రారంభించారు. ప్రస్తుతం ఈ అంగడి ద్వారా గ్రామ పంచాయతీకి తైబజార్ వేలం ద్వారా

'పంచాయతీ'కి తొలగిన అవాంతరాలు

కూడా ఆర్థిక లాభం చేకూరుతోంది. ప్రజలకు సతం వారానికి రెండు సార్లు సంత అందుబాటులో ఉండడంతో తాజా కూరగాయాలు లభించడంతో పాటు ప్రజలకు మేలు జరిగిందని భావిస్తున్నారు.

మున్సిపాలిటీ వివాదంతో నిలిపివేత

ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీని 2018-19లో ఉన్న అప్పటి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేసింది. దీంతో ఉట్నూర్ పంచాయతీని సైతం మున్సిపాలిటీగా ప్రకటించింది. దీంతో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిలిచిపోయాయి. ఉట్నూర్‌ను మున్సిపాలిటీ చేస్తే ఉట్నూర్ పరిసర ప్రాంతాల్లో ఉన్న పేదల ప్రజలకు ఇంటి పన్నులు పెరగడంతో పాటు, ఇతర పన్నులు తడిసి మోపెడు అవుతాయని, అంతేకాకుండా పేద ప్రజలు అధికంగా ఉంటున్నందున వారికి జాతీయ పనికి ఆహార పథకం దూరం అవుతుందని.. తద్వారా పేద ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఉట్నూర్ ప్రజలు మున్సిపాలిటి వద్దు అంటూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. దీంతో పాటు ఎస్టీ కమిషన్ సభ్యులు

(తరువాయి 6వ పేజీలో....)

> ఉట్నూర్ మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీకి ఎట్టకేలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. 2018-19లో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల ఎన్నికలు నిర్వహించగా.. ఉట్నూర్ పంచాయతీకి ఎన్నికలు కొన్ని అవాంతరాల వల్ల నిలిచిపోయా యి. ఏడేళ్లుగా గ్రామ పంచాయతీకి పాలకవర్గం లేకపోవడం తో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు మరుగున పడ్డాయి.



ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

నామినేషన్లు పూర్తి అయ్యాయి
: రాంప్రసాద్, ఎంపీడీవో, ఉట్నూర్



ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీకి నామినేషన్లు పూర్తి అయ్యాయి. 3వ తేదీన నామినేషన్ల ఉప సంహరణ అనంతరం ఉన్న అభ్యర్థులు పోటీలో ఉంటారు. వారికి అదే రోజు ఎన్నికల గుర్తులు కేటాయించడం జరుగుతుంది. ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం 35 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడం జరిగింది. ఉట్నూర్ పంచాయతీలో 12,622 మంది ఓటర్లు కాగా.. 6237 మంది పురుషులు, 6385 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.



ఉదయం వేళ చలిమంటలు కాగుతున్న ప్రజలు

చలి.. బెబ్బులి!

- రోజురోజుకూ పడిపోతున్న పగటి ఉష్ణోగ్రతలు
- తీవ్ర చలి గుప్పిట్లో ఆదిలాబాద్
- 8.2 డిగ్రీల సెల్సియస్ అత్యల్ప కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- గజగజ వణికిపోతున్న జనం

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అడవుల జిల్లాగా పేరున్న ఆదిలాబాద్‌ను చలి దుప్పటి కమ్మేసింది. గత రెండు రోజులుగా వాతావరణంలో భారీ మార్పులు చోటు చేసుకోవడంతో ఒక్కసారిగా పగటి ఉష్ణోగ్రతలు పడిపోయి కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. చల్లటి ఈదురు గాలులతో ఉదయం 9గంటల వరకు బయటకు వెళ్లే పరిస్థితులు కనిపించడం లేదు. సాయంత్రం 5గంటలకే జనం ఇళ్లలోకి వెళ్లిపోతున్నారు. 7గంటల ప్రాంతంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ, రోజు వారి కూలీలు చలి తీవ్రతతో తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. ఆదివారం గరిష్ఠ ఉష్ణోగ్రతలు 28.0 డిగ్రీలు నమోదు కాగా, కనిష్ఠ ఉష్ణోగ్రత 8.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. ఈ యేడు శీతాకాలం సీజన్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 8.2కు పడిపోవడం ఇదే మొదటిసారి. భీంపూర్ మండలం అర్లి(టి)లో 10.3, బోథ్ పొచ్చెరలో 10.4, తలమడుగులో 11.2, తాంసిలో 11.4, గుడిహత్నూర్‌లో 12.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. యేటా డిసెంబరులోనే ఉష్ణోగ్రతలు పడిపోయి చలి తీవ్రత పెరుగుతోంది. శీతాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా.. ఇంతటి చలి ప్రభావం ఎన్నడూ కనిపించ లేదని ప్రజలు వాపోతున్నారు. చలి గాలుల ప్రభావంతో సీజనల్ వ్యాధుల వ్యాప్తి పెరిగే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

బోథ్ రేంజ్‌లో సిబ్బంది కొరత

- 16 మంది బీట్ ఆఫీసర్‌లకు.. కేవలం నలుగురే విధులు
- పని ఒత్తిడితో ఉన్న సిబ్బందికి తప్పని తిప్పలు 7వ పేజీలో...



నర్సయ్యను సన్మానిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సంఘ విద్రోహ శక్తులతో పోరాటంలో కీలకపాత్ర : ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో శేష జీవితాన్ని ఆయురారోగ్యాలను కాపాడుకుంటూ ఆనందంగా గడపాలని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఆదివారం పోలీసు ముఖ్య కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన పీసీఆర్ ఎస్సై కె.నర్సయ్యను కుటుంబ సభ్యుల సమక్షంలో శాలువాతో ఘనంగా సన్మానించి ప్రభుత్వ వాహనంలో ఇంటికి సాదరంగా సాగనంపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం వ్యాయామం, యోగా నిర్వహిస్తూ ఆరోగ్యాన్నికాపాడుకోవాలని సూచించారు. సంఘ విద్రోహ శక్తులతో పోరాటంలో కీలకపాత్ర పోషించి జిల్లా ప్రశాంత వాతావరణంలో నెలకొల్పడానికి తన వంతు పాత్ర పోషించారన్నారు. తన సేవలకు మెచ్చిన ప్రభుత్వం 2000లో సేవా పథకంతో, 2025లో ఉత్తమ సేవా పథకంతో గౌరవించిందని తెలిపారు. ఇందులో పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో కృషి చేస్తా

- డీసీసీ నూతన అధ్యక్షుడు నరేష్ జాదవ్
- జిల్లాకేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో పార్టీ జిల్లాస్థాయి సమీక్షా సమావేశం

మరిన్ని వివరాలు 6వ పేజీలో....

సజావుగా ఎన్నికల నిర్వహణకు
ప్రజలు సహకరించాలి

- నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ రాజర్షి షా
- స్థానిక అధికారులకు పలు సూచనలు, సలహాలు

ఉట్నూర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేలా అధికార యంత్రాంగానికి ప్రజలు సహకరించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఎన్నికల నామినేషన్ల కార్యక్రమాన్ని పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియ, నామినేషన్‌ల ఉప సంహరణ కార్యక్రమాలు పూర్తి చేసి పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. మండలంలో 38 గ్రామ పంచాయతీల ఎన్నికల కార్యక్రమాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎంపీడీవో రాంప్రసాద్‌కు సూచించారు. ఇదిలా ఉండగా ఉట్నూర్ గ్రామ పంచాయతీలో కలెక్టర్‌ను గ్రామస్థులు కలిసి పలు విషయాలు వివరించారు. గతంలో 18 వార్డులు ఉంటే 9 వార్డులు ఎస్టీలకు, 2 వార్డులు ఎస్సీలకు, 2 వార్డులు బీసీలకు, 5 వార్డు జనరల్‌గా ఉండేవన్నారు. కానీ ఇప్పుడు 9 వార్డులు ఎస్టీలకు, 9 వార్డులు అన్ రిజర్వ్‌డు ఉండేవని తెలపడంతో మీ వద్ద పాత ప్రభుత్వ ఉత్తర్వుల కాపీలు తీసుకొస్తే పరిశీలిస్తామని కలెక్టర్ వారికి సూచించారు. కలెక్టర్ వెంట డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ అమృతలాల్, రిటర్నింగ్ అధికారి శివరాజ్, నాయకులు, తదితరులు ఉన్నారు.

ఇంద్రవెల్లి: స్థానిక సర్పంచ్ ఎన్నికలను అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని నామినేషన్ స్వీకరణ కేంద్రానికి సందర్శించి నామినేషన్ పరిశీలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆర్‌వోలతో మాట్లాడి వచ్చిన నామినేషన్‌ల వివరాలు



ఉట్నూర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజార్షిషా

తెలుసుకున్నారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాలను పరిశీలన చేసి, పోటీ చేసే అభ్యర్థుల వివరాలు నమోదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీవన్‌రెడ్డి, ఈవో సంజీవ్‌రావు, సర్పంచ్, వార్డు అభ్యర్థులున్నారు.

మావల: మావల మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన నామినేషన్ ప్రక్రియను కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఈ మేరకు అధికారులకు పలు కీలక సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి నుంచి ఆదిలాబాద్ గ్రామీణ, మావల, బేల, జైనథ్, సాత్నాల, భోరాజ్, తాంసీ, భీంపూర్ మండలాల్లో రెండవ విడత నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఈ పరిశీలనలో మావల మండల ప్రత్యేక అధికారి రాజలింగు, తహసీల్దార్ వేణు, ఎంపీడీవో కృష్ణవేణి, సంబంధిత ఆర్‌వోలు, అధికారులు, అభ్యర్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లిలో నామినేషన్‌ల పరిశీలన కార్యక్రమాన్ని పరిశీలిస్తూ..



మావలలో నామినేషన్ ప్రక్రియను పరిశీలిస్తూ..



బేలలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు

రెండో విడత.. నామినేషన్ కేంద్రాల పరిశీలన

జైనథ్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జైనథ్, బేల మండలాల్లో ఆదివారం రెండో విడతలో భాగంటీ నామినేషన్ ప్రక్రియ ప్రారంభం అయ్యింది. ఇందులో భాగంగా పంచాయతీ సర్పంచ్‌లు వార్డు అభ్యర్థుల ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పంచాయతీ ఎన్నికల రాష్ట్ర పరిశీలకుడు టి.వెంకన్న పరిశీలించారు. జైనథ్, బేల మండల కేంద్రాలలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు సమర్పిస్తున్న వివిధ ధ్రువపత్రాలను పరిశీలించి పలు సూచనలు సలహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జైనథ్ ఎంపీడీవో బి.సుధీర్‌కుమార్, బేల ఎంపీడీవో ఆంజనేయులు, ఎంపీఈవో ఎ.మహేశ్‌కుమార్, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.



జైనథ్‌లో పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు వెంకన్న

● ప్రారంభమైన నామినేషన్ ప్రక్రియ

జైనథ్: జైనథ్ ఉమ్మడి మండలంలోని సాత్నాల, బోరజ్, జైనథ్ మండలాలతో పాటు బేల మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా సర్పంచ్‌ల నామినేషన్ పర్వం ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జైనథ్, బేల, సాత్నాల, బోరజ్ మండలాల్లోని ఆయా గ్రామాలకు సంబంధించి సర్పంచ్‌ల నామినేషన్‌లను వేయడానికి ఆరు క్లస్టర్‌లుగా విభజించారు. ఆదివారం జరిగిన నామినేషన్‌లో జైనథ్ మండలంలోని ఆరు క్లస్టర్‌లలో 15 మంది సర్పంచ్ పదవులకు 3 వార్డు మెంబర్‌లకు సంబంధించిన నామినేషన్‌లు వచ్చాయని జైనథ్ ఎంపీడీవో బి.సుధీర్‌కుమార్ తెలిపారు. బోరజ్ మండలంలోని ఆరు నామినేసన్ క్లస్టర్‌లలో 11 సర్పంచ్ పదవులకు 2 వార్డు మెంబర్‌లకు నామినేషన్ పత్రాలు సమర్పించినట్లు బోరజ్ మండల ఎంపీడీవో సీహెచ్ వేణురెడ్డి తెలిపారు. సాత్నాల మండలంలోని ఆరు క్లస్టర్‌లలో (మిగితా 6వ పేజీలో...)



అయ్యప్ప పల్లకిని మోస్తున్న ఎమ్మెల్యే పాయల, మాజీ మంత్రి రామన్న

ఘనంగా ఆరట్టు ఉత్సవం 7

- ఆదిలాబాద్‌లో శోభాయాత్ర
- పెన్‌గంగలో చక్రతీర్థ స్నానం

నేటి సమాజంలో ఉన్నత విద్య ఎంతో అవసరం

- మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో ఉన్నత విద్య ఎంతో అవసరమని ఆ దిశగా లావ్‌జి సాల్వే కృషి ఎంతగానో ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ఆదివారం క్రాంతివీర్ లావ్‌జి సాల్వే 229వ జయంతి వేడుకలకు మాజీ మంత్రి జోగు రామన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విగ్రహ ఆవిష్కరణకు భూమిపూజ, సాల్వే చిత్రపటానికి పూజలు చేసి జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కోసం అందరి సహాయ, సహకారాలు అవసరమని పేర్కొన్నాడు. అలాగే ఆయన చూపిన పోరాట స్ఫూర్తి ఎందరో మంది మహనీయులను స్ఫూర్తివంతంగా తీర్చిదిద్దిందన్నారు. అంతేకాకుండా అణగారిన వర్గాలపై ఆరాచకాలు అన్యాయాలను తరిమి కొట్టడంలో ఆయన చూపిన మార్గం అనుసరిస్తూనే ఎన్నో విజయాలను పొందగలిగారన్నారు. ఇందులో యూనిస్‌అక్బానీ, లాంటేలి వాసుదేవ్, మధుకర్‌గొడికె, కోడే నర్సింగ్, దాదాజి కాంబ్లె, రమాకాంత్, దయానంద్, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణకు భూమిపూజ చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న



బోథ్ ఎక్స్ రోడ్డు వద్ద రోడ్డు ప్రమాదం

- లారీని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు
- క్లీనర్‌తో పాటు బాలుడి మృతి
- పరిశీలించిన జిల్లా ఎస్పీ

మరిన్ని వివరాలు 6వ పేజీలో...